ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర




వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 31 సంచిక : 6 ఫిబ్రవరి 2026



**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

**చందా**

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

**రమణ భాస్కర**

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342


## ఈ సంచికలో. . . .



సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు....... 2

భగవంతుడిని విశ్వసించండి ..................... 13

శ్రీమద్భగవద్గీత .................................... 15


**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం



మనము మాయ చేతిలో ఉన్నాము. మాయ భగవంతుడి చేతిలో ఉంది. మనం భగవంతుడి మీద పూర్ణవిశ్వాసం పెట్టుకొని, ఆయనను ఆశ్రయిస్తే భగవంతుని చేతిలో ఉన్న మాయను మన మీద పడకుండా చూస్తాడు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 04 మే 1995, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

బాహ్యంగా తిరుగుతున్న మనస్సుకు లోచూపు కలుగజేసి దానిని హృదయంలో ఉంచటానికి, హృదయంలో ముంచటానికి మహాత్ముల సాంగత్యం, సత్పురుషుల సహవాసం అవసరం. సత్పురుషుల సహవాసం గురించి బుద్ధుడు మాట్లాడుతూ ఉంటే అక్కడ వినేవాడు "మా ఊరిలో సత్పురుషులు ఎవరు ఉన్నారు? కొబ్బరిచెట్లు, తాటిచెట్లు తప్ప. సత్పురుషుల సహవాసం మా ఊరిలో దొరకదు" అన్నాడు. అప్పుడు బుద్ధుడు "సత్పురుషుల సహవాసం నీకు దొరకకపోతే అడవిలో ఏనుగులాగ ఒంటరిగా బ్రతుకు. అంటే కాఫీ దొరకలేదు అని ఎండ్రిన్ తాగవద్దు" అన్నాడు. కాఫీ దొరికితే తాగు, కాఫీ నాకు దొరకలేదు కాబట్టి ఈ పూట నేను ఎండ్రిన్ పుచ్చుకుంటాను అటువంటి మాటలు అనవద్దు అంటున్నాడు బుద్ధుడు. సత్పురుషుల సహవాసం నీకు దొరకలేదు అనుకో అడవిలో ఏనుగు లాగ ఒంటరిగా ఉండు. సుభాషితాలులో భర్తృహరి చెబుతాడు. కొంతమంది చెడ్డవాళ్ళు కూడా ఒకొక్కసారి మంచి వాళ్ళ సహవాసం చేస్తూ ఉంటారు. మామూలుగా వాళ్ళ nature bad అయినప్పటికీ సత్పురుషుల సహవాసం మంచిది అని మీటింగులో వింటూ ఉంటారు కదా అలా విన్నప్పుడు వాళ్లకి కూడా అనిపిస్తుంది మనం కూడా నాలుగు రోజులు మంచివారితో సహవాసం చేసి చూద్దాం అని, వాళ్ళ గురించి భర్తృహరి అది ఏనుగు స్నానం లాంటిదే అంటాడు. ఏనుగు ఏమి శుభ్రంగా స్నానం చేస్తుంది, తరువాత గట్టు మీదకి వచ్చి తొండం తోటి ఒళ్ళంతా బాడి చేసేసుకుంటుంది. అలాగే ఒక badman ఎప్పుడైనా accidentalగా సత్పురుషుల తోటి సహవాసం నాలుగు రోజులు చేసినా ఐదో రోజున మొత్తంగా రెట్టింపు bad తెచ్చేసుకుంటాడు అని చెప్పాడు.

భర్తృహరి చెప్పింది మీకు అర్థం అవుతోందా, ఎప్పుడైనా చెడ్డ వాడు మంచి వాడి తోటి స్నేహం చేస్తే అది గజ స్నానం అన్నాడు. ఏనుగు స్నానం చేసేటప్పుడు శుభ్రంగా

చేస్తుంది కానీ గట్టు మీదకి వచ్చిన ఐదు నిమిషాలలో ఆ తొండం తోటి తన శరీరం అంతా కూడా బాడి చేసేసుకుంటుంది. అలాగే badman ఎప్పుడైనా accidentalగా మంచి వాళ్ళతోటి స్నేహం చేసినా నాలుగు రోజులు ఉంటాడు, ఐదో రోజున వాడి కంపెనీలో కలిసిపోతాడు. అంటే మనిషి స్వభావాన్ని మార్చుకోవడం చాలా కష్టం. **నిగ్రహః కిం కరిష్యతి** అన్నాడు కృష్ణుడు. స్వభావం యొక్క వేగం మార్చుకోవడం గురువు అనుగ్రహం లేకపోతే చాలా కష్టం. "సముద్రంలో నీళ్ళు అంతా తాగగల శక్తి నీకు ఉన్నా గురువు యొక్క పాదాల మీద భక్తి లేకపోతే ఎందుకురా నీకు ఆ శక్తి" అంటారు ఆచార్యస్వాములవారు. ఎందుచేత అంటే ఏదొక divine interference, ఒక జ్ఞాని interference లేకపోతే నీ స్వభావం నుంచి నువ్వు బయట పడలేవు. స్వభావం యొక్క వేగం అటువంటిది. నదికి వరద వచ్చినప్పుడు నా చెయ్యి అడ్డు పెడతాను అనుకోండి ఆ వరద ఆగుతుందా, అలాగే ఎప్పుడైనా జ్ఞాపకం వచ్చినప్పుడు కృష్ణా, రామా అని నువ్వు అనుకున్నప్పటికీ నీ స్వభావం యొక్క వేగం ఆగదు, అది చాలా కష్టం, దానికి ఒక దేవతానుగ్రహం ఉండాలి, ఒక గురువు అనుగ్రహం ఉండాలి. విపరీతమైన గాలివాన వస్తోంది అనుకోండి చెయ్యి పెడితే గాలివాన ఆగుతుందా, అలాగే మీ స్వభావం ఏవో మాటల వల్ల ఆగదు. దానికెంతో కృషి అవసరం. ఒక realized soul యొక్క అనుగ్రహం అవసరం. లేకపోతే సాధ్యం కాదు అని చెబుతున్నారు. ఈ కలకత్తా streetsలో తిరిగే ఈ boyని, వివేకానందని చేసేశాడు కదా మా మాస్టర్ అంటాడు స్వామీజీ. మా మాస్టర్ అంటే ఎవరు? రామకృష్ణుడు. మనకి ఎంతసేపు థియరీ గొడవే కానీ ప్రాక్టీస్ గొడవ ఉండదు. రామకృష్ణుడికి ఎవరైనా ఒక మంచి మాట చెబితే వెంటనే దానిని ప్రాక్టీసు చేసేవారు. ఎవరైనా ఏదైనా ఒక మంచి మాట మాట్లాడితే మనం వింటాం కాని మనకు ప్రాక్టీస్ గొడవ ఉండదు. రామకృష్ణుడు అలా కాదు ఎవరైనా ఒక మంచి మాట చెప్పారు అనుకోండి వెంటనే ప్రాక్టీస్ లోకి వెళ్ళిపోయేవాడు. అలా ప్రాక్టీస్ చేసి చేసి ఆయన ప్రాక్టీస్ వల్ల వచ్చిన అనుభవాన్ని చివరి రోజులలో ఇవ్వటం మొదలు పెట్టాడు. అలా పుచ్చుకున్న studentsలో నేను ఒకడిని అన్నాడు నరేంద్రుడు. ఎక్కువ సాధనలు

చేసేయ్యక్కర్లేదు. కొద్దిగా చేసినప్పటికీ మన మనసు శుద్ధం అవుతూ ఉంటుంది. బయటకి అందరి శరీరాలు ఒకటిలాగే కనిపిస్తాయి. అందరికీ రెండు కాళ్ళే, అందరికీ రెండు చేతులే, అందరికీ రెండు కళ్లే, అందరికీ ఒక ముక్కే. కాని లోపల మనసులో పరిశుద్ధ మనస్సు, అపరిశుద్ధ మనస్సు. నువ్వు పరిశుద్ధ మనస్సువు అయితే లోపల ఉన్న వస్తువు నీకు తెలుస్తూనే ఉంటుంది. నువ్వు ఎన్ని పుస్తకాలు చదివినా, ఎన్ని నదుల్లో మునిగినప్పటికీ అపరిశుద్ధ మనస్సు అయితే వస్తువు నీకు వ్యక్తం కాదు. నువ్వు చేసే సాధన నీ మనస్సు శుద్ధం అవ్వటం కోసం, నీ లోపల ఉన్న సద్వస్తువు వీటి అన్నిటికీ మంచికి, చెడ్డకి, పుణ్యానికి, పాపానికి, ధర్మానికి, అధర్మానికి అతీతమైనది లోపల ఉన్న వస్తువు. ఈ ధర్మం, అధర్మం, పుణ్యం, పాపం, పరిశుద్ధం, అపరిశుద్ధం, ఇవన్నీ మనస్సుకే. నువ్వు చేసే సాధన, నువ్వు చేసే ధ్యానం, నువ్వు చేసే జపం, నువ్వు చేసే పూజ, నీ అపరిశుద్ధమైన మనస్సుని శుద్ధమైన మనస్సు చెయ్యటం కోసమే, నీ మనస్సు శుద్ధం అవుతుంటే, నీ మనస్సు purify అవుతుంటే, అపుడు లోపల ఉన్న వస్తువు నీకు వ్యక్తం అవుతుంది. రామాయణంలో రామచంద్ర మూర్తి చెప్పిన ఈ వాక్యం నాకు చాలా ఇష్టం. లక్ష్మణస్వామి, రామచంద్రమూర్తి, సీతమ్మవారు చెరువు ఒడ్డున కూర్చున్నారు. అప్పుడు సీతమ్మవారు ఈ చెరువులో నీళ్ళు ఎంత బాగున్నాయో అంటుంది. అప్పుడు రామచంద్రమూర్తి “నిజమే, ఈ నీళ్ళు చాలా స్వచ్ఛంగా ఉన్నాయి. ఈ నీళ్ళు ఎంత స్వచ్ఛంగా ఉన్నాయి అంటే సత్పురుషుడు హృదయంలా ఉన్నాయి” అంటాడు. ఆ డైలాగ్ చూడండి. నిజమే ఆ చెరువులో నీళ్ళు చాలా స్వచ్ఛంగా ఉన్నాయి. ఎలా ఉన్నాయి అంటే సత్పురుషుల హృదయంలా ఉన్నాయి. అంత క్లియర్‌గా ఉన్నాయి. ఇంతకీ భగవాన్ చెప్పేది ఏమిటంటే, మారు మనసు పొందడం నువ్వు అనుకున్నంత తేలిక కాదు. దానికి కేవలం నీ తెలివి తేటలు సరిపోవు. నీ ముక్కు మూసుకోవటాలు సరిపోవు. ఒక బ్రహ్మానుభవం పొందిన వాడి యొక్క, జ్ఞాని యొక్క అనుగ్రహం కూడా అవసరం. భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే మీరు పెద్ద పెద్ద సాధనలు చెయ్యలేకపోయినా, నాకిష్టమైన పనులు చేసినా మీరు నా దయకి పాత్రులు అవుతారు. ఎప్పుడైతే నా దయకి మీరు

పాత్రులు అయ్యారో నా స్వరూపాన్ని మీకు ఇస్తాను, మీరు అడగకుండానే ఇస్తాడు అంటున్నాడు. కొంతమంది ఏదో మంచి పని చేస్తారు అది అందరికీ తెలియాలి అనుకుంటారు. వాళ్ళది కూడా తేలిక స్వభావం. వాళ్ళ మనస్సులు కూడా హృదయంలో మునగవు. మనం ప్రపంచంలోంచి గుర్తింపు కోరుతున్నాం అనుకోండి గౌరవమో, గుర్తింపో కోరుతున్నాం అనుకోండి మనవి అన్నీ తేలిక మనస్సులు. మనకి తేలిక స్వభావం ఉన్నప్పుడే గుర్తింపు కోరుతాం. మనకి తేలిక స్వభావం లేదు అనుకోండి గుర్తింపులు కోరము. అప్పుడు మనస్సు వెళ్ళి హృదయగుహలోకి జారి పడిపోతుంది. భగవాన్ ఏమి చెబుతారు అంటే మనస్సును మీరు పెద్ద బలవంతాన గెంటక్కర్లేదు, నా చేతిలో ఉన్న ఈ పుస్తకాన్ని ఇప్పుడు నేను వదిలేశాను అనుకోండి అది కింద పడుతుంది కానీ పైకి వెళ్ళదు కదా. అదే విధంగా ఈ గుర్తింపులు మీరు వదులుకుంటే మీ మనస్సు వెళ్ళి హృదయగుహలో పడిపోతుంది. బలవంతాన ఏదో దూడని తోలుకు వెళ్ళినట్టు మీరు దానిని తోలుకు వెళ్ళక్కర్లేదు, మీ మనస్సులో ఉన్న ఆ చిన్న చిన్న విషయాలు, ఆ చిన్న చిన్న బుడగలు లాంటివి, కెరటాలు లాంటివి వదిలేస్తే ఈ పుస్తకం వదిలేస్తే కింద ఎలా పడిపోతుందో అలాగే మనస్సు కూడా అనవసరమైన గొడవలు వదిలేస్తే అది వెళ్ళి దాని స్వస్థానంలో, హృదయంలో పడిపోతుంది. అప్పుడు నీకు స్వస్థత చేకూరుతుంది. భగవంతుడి దయకి ఎప్పుడైతే మనం పాత్రులం అయ్యామో, ఆయన శాంతి, ఆయన జ్ఞానం, ఆయన వైభవం మనకి ఇచ్చేస్తాడు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే మనస్సు అణిగితే సరిపోదు. మనస్సు నశించాలి. ప్రాణాయామం మనస్సు అణిగేలాగా చేస్తుంది కానీ మనస్సు నశించేలా చెయ్యదు. కానీ విచారణ వల్ల మనస్సు నశిస్తుంది. నువ్వు ధ్యానం, ప్రాణాయామం చేస్తే అది అణుగుతుంది కానీ నశించదు.

**నీ హృదయంలో ఉన్న సత్యం శరీర రహితం, ఉపాధి రహితం. నీ హృదయంలో ఉన్న సత్యం దగ్గరికి నువ్వు చేరుకునే వరకూ నీ ప్రయాణం ఆపవద్దు.**



ఒక్క విచారణ వల్ల మటుకే మనస్సు నశిస్తుంది. ఇప్పుడు మాములుగా మాటల సందర్భంలో వాడు పూర్వం లాగ ఉన్నాడు అనుకుంటున్నారు ఏమో వాడు బాగా తీరిపోయాడు అంటారు. అలాగే మనస్సు ఆత్మగా తీరినప్పుడు అంటే మనస్సు ఆత్మని చింతించగా, చింతించగా అది ఆత్మ అయ్యిపోతుంది. నువ్వు ఏదైతే చింతిస్తావో అదే నువ్వు అయ్యిపోతావు. మనస్సు ఆత్మగా తీరినప్పుడు ఆత్మగా నువ్వు అయినప్పుడు నీ వాసనలు గురించి నువ్వు కంగారు పడక్కర్లేదు. వాటంతట అవే రాలిపోతాయి. అంటే నువ్వు ఆత్మగా తీరినప్పుడు నువ్వు ఆధ్యాత్మికంగా ఎదిగినప్పుడు వాటంతట అవి రాలిపోతాయి. అంటే చైతన్య స్థాయి నీకు పెరిగే కొలది ఈ వాసనలు ఎలాగ పోగొట్టుకోవడం అని చింతించనక్కరలేదు. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే ఇప్పుడు నరసాపురం వెళ్ళిపోతాం అనుకోండి జిన్నూరుకి ఎలాగా దూరం అవ్వడం, జిన్నూరుకి ఎలాగా దూరం అవ్వడం అని అనుకోవక్కర్లేదు మీరు నరసాపురానికి దగ్గర అయ్యే కొలది జిన్నూరుకి దూరం అయిపోతూ ఉంటారు. అదేవిధంగా నీ చైతన్య స్థాయి పెరిగిపోతుంది అనుకో అప్పుడు ఈ వాసనలు వాటంతట అవే నిన్ను విడిచి పెట్టి పోతాయి అంటున్నారు భగవాన్. అంటే నరసాపురం దగ్గరకి వెళ్ళే కొలది జిన్నూరుకి ఏ విధంగా అయితే దూరం అవుతామో నువ్వు ఆత్మగా తీరిపోతున్నావు అనుకో, జ్ఞానంలో ఎదిగిపోతున్నావు అనుకో, చైతన్యంలో ఎదిగి పోతున్నావు అనుకో, ఈ వాసనలు ఎలా పోతాయి, ఈ వాసనలు ఎలా పోతాయి అని నువ్వు అనుకోవక్కర్లేదు. వాటంతట అవే పోతాయి. మొన్న ఎవరో అంటున్నారు ఎక్కడో మా కోడలు పెళ్లి అయినప్పుడు ఎలా ఉందో ఇప్పుడు అలా లేదు. ఈ నాలుగేళ్ళలో ఎలా తేడా వచ్చేసిందో వచ్చేసింది బాగా తీరింది అంటున్నారు. అంటే కొంతమంది చూసి నేర్చుకుంటారు. ఇంక కొంతమంది స్మశానానికి వెళ్ళేవరకు అంతే, కొన్ని జీవితాలు ఏమిటో వందేళ్ళు బ్రతికినా, రామ రామ అలాగే ఉంటారు. వాళ్ళని కనుబొమ్మ మీద వెంట్రుకలు అంటారు. అవి పుట్టినప్పుడు ఎలా ఉంటాయో, స్మశానానికి వెళ్ళినప్పుడు అలాగే ఉంటాయి. అలాగే కొంతమంది వంద సంవత్సరాలు బ్రతికినా మాటా, తీరు ఉండదు మంచి నేర్చుకోవటం ఏమీ ఉండదు. ఇంక

తల్లి కడుపులోంచి బయటకి వచ్చినప్పుడు ఎలా ఉంటారో, వందేళ్ళు బ్రతికినా ఇంక బియ్యం బస్తాలు ఖర్చు తప్పించి ఇంక స్మశానానికి వెళ్ళే రోజున కూడా అలాగే ఉంటారు. మా కోడలు పెళ్ళికూతురుగా ఉన్నప్పుడు ఎలా ఉందో అలా లేదండి కొంచెం తీరిందండి అన్నారు. అలా చెపితే నేను కూడా సంతోషించాను. మామూలుగా మన కుటుంబంలో ఎలా మాట్లాడుకుంటామో భగవాన్ అలాగే చెపుతున్నారు. భగవాన్‌కి వంటింట్లో దేవుడు అని పేరు. ఆయన మనల్ని దేవాలయంలోకి తీసుకు వెళ్ళటం లేదు, జ్ఞానాలయంలోకి తీసుకు పోతున్నారు. కొంతమంది వంటింటి చుట్టాలు అని ఉంటారు. వాళ్ళు ఇంక గుమ్మాలు దగ్గర ఆగరు. వంటింట్లోకి డైరెక్ట్‌గా వెళ్ళిపోతారు. అలా డైరెక్ట్‌గా బ్రహ్మం దగ్గరకి తీసుకు పోతారు. అంటే మామూలుగా దేవాలయం గేట్లు దగ్గర ఆపు చెయ్యడు, మూల విరాట్ ఎక్కడుందో అక్కడకు తీసుకు పోతాడు. దూరపు చుట్టం అయితే అడుగుతాడు. లోపల అమ్మగారు ఉన్నారా, అయ్యగారు ఉన్నారా ఫలానా వాళ్ళు వచ్చారు అని చెప్పిరా, ఈ గొడవలు అన్నీ ఉంటాయి. వంటింటి చుట్టాలకు ఈ గొడవలు ఉండవు, డైరెక్ట్‌గా వెళ్ళిపోతారు. భగవంతుడు పరిచయం ఎలా ఉంటుంది అంటే ఒకొక్కసారి ఆయనతో మాట్లాడుతూ ఉంటే ఎన్ని వేల జన్మల నుంచి ఈయనతో మనకి పరిచయం ఉందో అనిపిస్తుంది. కొంతమంది అంత సాన్నిహిత్యం ఫీల్ అవుతారు. మొట్టమొదటిసారి చూసుకోవడం అదే అనుకోండి కానీ కొంతమందికి అనిపిస్తుంది ఎన్ని వేల జన్మల నుంచి ఈయన తోటి మనకి సాన్నిహిత్యం ఉందో అని, కొత్తగా మనం మాట్లాడటం లేదు, ఇది ఏనాటి అనుబంధమో, ఆ అనుబంధం బ్రేక్ అవ్వలేదు, ఆ అనుబంధం కంటిన్యూ అవుతోంది అనిపిస్తుంది అంతే కాని కొత్తగా మాట్లాడినట్టు అనిపించేది కాదు. మాకు ఆ వాసనలు ఉన్నాయి, ఆ గొడవలు ఉన్నాయి అవన్నీ నీకు ఎందుకు? నువ్వు చైతన్యంలో తీరు, ఎలా బ్రహ్మముగా తీరు, జ్ఞానంలో ఎదుగు. వాటి గొడవ నీకు ఎందుకు? అవే కాలి బూడిద అయిపోతాయి. అస్తమాను వాటికి బలం ఇచ్చి బాధపడడం ఎందుకు. వాటి వంక చూడకు నువ్వు, నువ్వు బ్రహ్మం వైపే దృష్టి పెట్టుకో, చైతన్యం వైపుకే నువ్వు దృష్టి పెట్టుకో. జ్ఞానంలో ఎదిగి వెళ్ళిపో

అప్పుడు జ్ఞానాగ్నిలో ఈ వాసనలు అన్నీ కాలి బూడిద అయ్యిపోతాయి. వాసనలు పోవటం లేదు, వాసనలు పోవటం లేదు అని వాటి గొడవ నీకు ఎందుకు? అవే ఊడిపోతాయి, ఒకవేళ తాత్కాలికంగా ఉన్నప్పటికీ నిన్ను బాధించవు. కొంతమంది అంటూ ఉంటారు మా ఆయనకి భక్తి లేకపోయినా నన్నేమి అడ్డం పెట్టటం లేదు అంటారు. అలాగే మీ వాసన కూడా పూర్తిగా నాశనం అవ్వకపోయినా సాధన చేసేవాడిని పాడు చెయ్యకుండా ఉంటాయి. పూర్తిగా కాలి బూడిద అవ్వటానికి కొంత టైము పడుతుంది. కంగారు పడక్కర్లేదు మీరు చేసుకునే సాధనకి అడ్డురావు. అవి నెమ్మదిగా ఊరికే నామమాత్రంగా ఉంటాయి. ఎలాగ అంటే పగటి చంద్రుడు లాగ. పగటి పూట చంద్రుడు ఉంటాడు కానీ ఉన్నప్పటికీ లేనట్టే లెక్క, అలాగే ఏదో temporaryగా కొన్ని సంస్కారాలు నీకు ఉన్నప్పటికీ అవి నిన్నేమి బాధించవు, నిన్నేమి అడ్డు పెట్టవు. కాలప్రవాహంలో కాలి బూడిద అయిపోతాయి. జ్ఞానికి కూడా మనస్సు ఉంటుంది కానీ అది పగటి చంద్రుడు. పగటి చంద్రుడు ఉంటాడు కానీ దాని ప్రభావం మటుకి ఉండదు. ఊరికే గుర్తింపు కోసం ఈ రూపం, ఈ నామం, వ్యవహారం కోసం ఉంటుంది అంతే. మీరు డాక్టరు గారు అనుకోండి డాక్టరు గారు అని జ్ఞానికి తెలుస్తూ ఉంటుంది గుర్తింపు కోసం. భగవాన్ ఏమంటున్నారు మిమ్మల్ని తీరమంటున్నారు. ఎలా తీరమంటున్నారు అంటే ఆత్మగా తీరండి, జ్ఞానంగా తీరండి. పుట్టినప్పుడు ఎలా ఉన్నారో ఇప్పుడు కూడా అలా ఉండకండి. ఎదగండి. మీరు ఎంత చిన్న ప్రయత్నం చేసినా కూడా మీరు చేసేది చిన్న ప్రయత్నం అయినా, చిన్న సాధన అయినా, చిన్న ధ్యానం అయినా, చిన్న విచారణ అయినా అది బహు స్వల్పం అయినా, అత్యంత స్వల్పం అయినప్పటికీ మీ అపరిశుద్ధ మనస్సు శుద్ధ మనస్సుగా మారిపోతుంది.

మీ చిన్న ప్రయత్నం కూడా ఊరికే పోదు. మీ అపరిశుద్ధమైన మనస్సుని, పరిశుద్ధమైన మనస్సుగా అది మారుస్తుంది. అందుచేత మీరు తీరడానికి ప్రయత్నం చెయ్యండి. మీ లోపల సహజస్థితి ఉందంటున్నారు. కానీ మేము సహజంగా లేము అసహజంగానే ఉన్నాము అని మాకు అనిపిస్తుంది, మనం అందరం ఎలా ఉన్నాము?

సహజంగా ఉన్నామా? అసహజంగా ఉన్నామా? మనం ఎప్పుడైనా కొన్ని సుఖాలు అనుభవిస్తున్నాం కదా, అసలు సుఖాలు లేకపోతే ఇంతకాలం బ్రతకలేము. ఏదో కొంచెం కొంచెం అనుభవిస్తున్నాం. పాలలో నురగ లాగ, మనం అనుభవించే సుఖాలు అసహజమైనవి, అది సహజమైన happiness కాదు. సహజమైన happiness ఎక్కడ నుంచి వస్తుంది అంటే, హృదయంలోంచి వస్తుంది. నా హృదయంలో సహజమైన వస్తువు ఉంది. దేశ కాలాలకి అతీతమైన వస్తువు, ఈ చావులకి, పుట్టుకలకి, ఈ రాగాలకి, ఈ ద్వేషాలకి, ఈ ఇష్టాలకి, అయిష్టాలకి, సంసారగొడవలకి అతీతంగా వస్తువు ఒకటి నా హృదయంలో సహజంగా ఉంది. కానీ నేను సహజంగా లేను. నేను అసహజంగా ఉన్నాను అన్న సంగతి నాకు తెలుస్తోంది. నీకు తెలియకపోయినా నాకు తెలుస్తోంది నేను సహజంగా లేను, నేను అసహజంగానే ఉన్నాను. మరి నా హృదయంలో సహజంగా వస్తువు ఉంటే నేను అసహజంగా ఉన్నాను అని నాకు ఎందుకు అనిపిస్తోంది అని అడుగుతున్నాడు. దానికి భగవాన్ ఏమి అంటున్నారు అంటే ఇవన్నీ కూడా నీ తలంపులే. నీ ఇష్టం ఒక తలంపు, నీ అయిష్టం ఒక తలంపు, నీ తలంపుల వల్లే నీకు అసహజస్థితి వస్తుంది. అసలు వస్తువుకి తలంపులు లేవు. తలంపులు అన్నీ ఎవరివి, మనస్సువే. తలంపు ఎక్కడ నుంచి వస్తుంది, మనస్సు లోంచి వస్తుంది. అందుచేత నేను అసహజంగా ఉన్నాను, నేను నార్మల్‌గా లేను, నేను naturalగా లేను అనుకోవడం కూడా ఒక తలంపే. రాగం ఒక తలంపు. భయం ఒక తలంపు. ద్వేషం ఒక తలంపు. ఇష్టం ఒక తలంపు, అయిష్టం ఒక తలంపు. వీటి లోంచి విడుదల పొందితేనే కానీ సహజంగా ఉన్న స్థితి నీకు తెలియదు. అంటే నువ్వు ఏదైతే కాదో అందులోంచి నువ్వు విడుదల పొందితే నీకు సహజస్థితి తెలుస్తుంది. ఏదైతే నువ్వు కాదో, అది నువ్వు అనుకుంటున్నావు కాబట్టి నేను అసహజస్థితిలో ఉన్నాను అని నీకు అనిపిస్తోంది, ఉన్నావు కూడా, అయితే ఇక్కడ ఒక technique ఉంది, నువ్వు అసహజస్థితిలో ఉన్నప్పుడు కూడా అది కరెక్ట్ state కాదు. అసహజస్థితిలో ఉన్నాను అని నీవు అనుకొన్నప్పుడు కూడా నువ్వు సహజస్థితిలోనే ఉన్నావు. కానీ అసహజస్థితిలో ఉన్నాను అని నీవు

అనుకుంటున్నావు. ఎందుచేత అంటే తలంపుల తోటి నీకు ఉన్న తాదాత్మ్యం వల్ల అలా అనిపిస్తోంది. అందుచేత తలంపుల నుంచి విడుదలపొందితే నువ్వు సహజస్థితిలో ఉన్నావు అన్న సంగతి నీకు తెలుస్తుంది. సహజస్థితి అంటే ఏమిటి? అది ఆదిస్థితి. ఆ స్థితి నీకు ఈ disturbance అణిగిపోయినప్పుడు వస్తుంది. తలంపులే నువ్వు అనుకో సాధన చేసినా అవి పోవు. అందుచేత ఈ గొడవలు అన్నీ అటు ఉంచు. నువ్వు తీరటానికి ప్రయత్నం చెయ్యి. అంటే భగవాన్ ఏది కూడా negativeగా చెప్పరు, positiveగా చెప్తారు. ఆయనకి అదొక అలవాటు. భగవాన్ దగ్గరకి ఎవరైనా వచ్చి వాడు చెడ్డవాడు అని చెప్పారు అనుకోండి, అటువంటి మాటలు నాకు చెప్పకండి అని చెప్పేవారు. Negativeగా చెప్పే అలవాటు ఆయనకి లేదు. ప్రతీ మాట positiveగా చెప్తారు. అందుచేత మీరు తీరండి, జ్ఞానంలో ఎదగండి, ఆత్మ తోటి అనుబంధం పెట్టుకోండి, ఉన్న సద్వస్తువు తోటి మీరు అనుబంధం పెట్టుకోండి అంటున్నారు. ఆ సద్వస్తువే మీరు ఆదిగా ఉన్న స్థితి. ఈ గొడవలు అన్నీ మీరు మధ్యలో కల్పించుకున్నారు, మన ప్రపంచాన్ని దేనితో చూస్తున్నాం. ఇంద్రియాల తోటి చూస్తున్నాం. చూసేవాడు, చూడబడేది దేవుని యొక్క కల్పన. ఎంత బాగా చెప్పారో చూడండి. దేవుడి కల్పన దేవుడి వ్యాపారం అన్నారు. ఈ మాట బాగా పట్టుకోండి. ఈ మాట మీ గుండెకి గట్టిగా పట్టుకోవాలి. ఇది దేవుని వ్యాపారం. ఈ ప్రపంచాన్ని చూసేవాడు, చూడబడే ఈ ప్రపంచం, చూడబడే ఈ దేహం, దేహం కూడా మన చేత చూడబడుతోంది కదా, మన చేత చూడబడేది అంతా కూడా దేవుడి యొక్క వ్యాపారం, దేవుడి యొక్క కల్పన. దేవుడి యొక్క వ్యాపారం, దేవుడి యొక్క కల్పన ఎవడైతే దాటాడో, ఈ ప్రకృతిని ఎవడైతే దాటాడో, ఈ సృష్టిని ఎవడైతే దాటాడో, వాడికి జ్ఞానం వస్తుంది. Simple విషయం. ఇదంతా ఒక వ్యాపారం అన్నారు. ఈ వ్యాపారం ఎప్పుడూ ఉంటుంది. కానీ ఆ వ్యాపారం లోంచి బయట పడినవాడు జ్ఞాని. దేవుడు కల్పన లోంచి ఎవడైతే విడుదలపొందాడో వాడు దేవుడి యొక్క స్వరూపాన్ని పొందుతాడు. అదొక్కటే జ్ఞాపకం పెట్టుకోండి. మనకి సాధ్యం కానిది అంతా కూడా ఆచార్యుల వారికి సాధ్యం

కాదు, కృష్ణుడికి సాధ్యం కాదు అనుకొంటాము. అంటే కృష్ణుడు గోవర్ధనపర్వతం ఎత్తాడు అని భాగవతంలో ఉంటుంది. అదంతా ఏమి నిజం, గోవర్ధనపర్వతం మనిషి ఎత్తగలడా అని మీరు అనుకోవచ్చు. అంటే మీరు ఎత్తలేరు కాబట్టి కృష్ణుడు కూడా ఎత్తలేడు అని మన భావన, ఇదే మన దగ్గర ఉన్న కురచ ఆలోచన, అది కురచబుద్ధి, అందుకే స్వామి వివేకానంద చికాగో ఉపన్యాసంలో ఆయన మొట్టమొదట చెప్పింది ఇదే మాట. అందరూ ఆశ్చర్యపోయారు. మీరు, మేము మనం అందరం నూతిలో కప్పలం అన్నాడు. ముందు వేదాంత మాటలు ఆయన చెప్పలేదు. స్వామి వివేకానంద కంటే ముందు speakers ఏమని అడ్రస్ చేసేవారు అంటే ladies and gentlemen అనేవారు. అయితే మనం సోదర సోదరీమణుల్లారా అన్నట్లే అమెరికాలో ladies and gentlemen అంటారు. స్వామీజీకి కొంచెం భయం వేస్తోంది. అమెరికాలో మాట్లాడటం అదే ప్రథమం. అక్కడే ఆయనకి గురు కటాక్షం పనిచేసింది. ఆయన ladies and gentlemen అనడం మానేసి ముందు ఏమన్నాడు అంటే sisters and brothers of America అన్నాడు. అమెరికన్స్ అందరూ చాలాసేపు గట్టిగా చప్పట్లు కొట్టారు. అందరు చప్పట్లు కొడుతుంటే మన meetingకి response వస్తోంది అని, ఈయనకి confidence వచ్చేసింది. అద్భుతంగా మాట్లాడేశాడు ఇది గురువు అనుగ్రహం, మీకు అర్థం అవుతోందా, చప్పట్లు కొట్టకపోతే ఈయనకి confidence లేకపోను. ఏ మాట చెప్పినా, నిర్మొహమాటంగా చెప్పేయటం స్వామీజీకి ఒక అలవాటు, ఆయన నిర్మొహమాటంగా చెబుతారు. మనం అందరూ నూతిలో కప్పలం అన్నాడు. నూతిలో కప్పలు ఉంటాయి కదా, ఒక రోజు ఏమైంది అంటే ఒక సముద్రంలో ఉన్న కప్ప ఎలా వచ్చి పడిందో ఈ నూతిలో పడింది. ఈ నూతిలో కప్పలు అన్నీ వచ్చి గబగబా చూడటానికి వెళ్ళాయి కొత్త



**ఆహారం మితంగా తీసుకోకపోవటం, మనస్సుకి ఏకాగ్రత లేకపోవటమే మన సాధనకి అవరోధాలు.**

కప్ప వచ్చింది అని, కొత్త కప్ప వచ్చింది కదా, ఎక్కడ నుంచి వచ్చింది మనం అడుగుదాం అని, మనం కూడా కొత్త వాళ్ళని చూసినప్పుడు మీరు ఎక్కడ నుంచి వచ్చారు అని అడుగుతాము కదా! ఈ నూతిలో కప్పలు అన్నీ కొత్త కప్ప దగ్గరకి వెళ్ళి నువ్వు ఎక్కడ నుంచి వచ్చావు, అసలు విషయం ఏమిటి అని అడిగాయి. ఆ కప్ప నేను సముద్రం నుంచి వచ్చాను అంది. సముద్రం గురించి ఐడియా లేదు ఈ నూతిలో కప్పలకి, ఎప్పుడైనా చూస్తే కదా, అవి పుట్టడం నూతిలో పుట్టాయి, పెరగడం నూతిలో పెరుగుతున్నాయి, చావటం కూడా నూతిలోనే. అందుచేత వాటికి ఆ నుయ్యే ప్రపంచం. అందులో ఒక కప్ప ఏమి చేసింది అంటే ఒక బెత్తుడు లెక్క ఉరికి ఇంత ఉంటుందా మీ సముద్రం అని అడిగింది. ఆ సముద్రంలోంచి వచ్చిన కప్పకి ఎలా చెప్పాలో అర్థం అవ్వట్లేదు. అప్పుడు ఇంకొక కప్ప దీనికి అర్థం అవ్వటం లేదు చెప్పటానికి అని ఇంకా కొంచెం బాగా ఒక జానెడు ఉరికింది. ఇంత ఉంటుందా చెప్పు నువ్వు వచ్చిన సముద్రం అని అడిగింది అని ముందు ఈ కథ చెప్పారు. అంటే మనవి అంత కురచ బుద్ధులు. ఆచార్యస్వాములవారు భారత దేశానికి చేసిన సేవకి కృతజ్ఞతా పూర్వకంగా, కృతజ్ఞతా సూచకంగా ఈ రోజున ఆచార్యుల వారి ఈ రమణ క్షేత్రం తరపున జరపటం అయ్యింది. అందుచేత ఆచార్యుల వారి అనుగ్రహం, ఆచార్యుల వారి యొక్క grace, మీ అందరి శిరస్సుల మీద వర్షించాలని, ఆచార్యస్వాములవారి యొక్క అనుగ్రహం వల్ల మీకున్న కోరికలు అన్నీ నేరవేరాలి అని ఆయనను ప్రార్థిస్తున్నాను.

**అరుణాచల శివ, అరుణాచల శివ, అరుణాచల శివ, అరుణాచలా**
**అరుణాచల మనుచు స్మరియించు వారల అహము నిర్మూలింతువు అరుణాచల**
**అరుణాచల శివ, అరుణాచల శివ, అరుణాచల శివ, అరుణాచలా!!**
**హర హర శంకర జయ జయ శంకర, హర హర శంకర జయ జయ శంకర.**

ఒకోసారి శంకరుడు ఏమి చేస్తాడు అంటే మీ కోరికలు అన్నీ నేరవేర్చేస్తూ ఉంటాడు ఎందుకని, మీ ముఖం ఆయన వంక తిప్పుకోవడం కోసం, హర హర శంకర జయ జయ శంకర, హర హర శంకర జయ జయ శంకర.

**ఓం నమఃశ్శివాయ. శాంతిః శాంతిః శాంతిః**

# భగవంతుడిని విశ్వసించండి

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)

ఈశ్వరుడి పట్ల విశ్వాసం ఉంచండి. రామకృష్ణుడు అంటాడు, మిఠాయిని మీరు అడ్డంగా కొరికినా మిఠాయే, నిలువుగా కొరికినా మిఠాయే. మిఠాయి అడ్డంగా తిన్నా నిలువుగా తిన్నా, ఎలా తిన్నా ఒకటే తీపి కదా. దేవుడికి ఆకారం ఉండవచ్చు, దేవుడికి ఆకారం లేకపోవచ్చు. ఆ గొడవల జోలికి వెళ్ళకండి. దేవుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. వాడికి గుణాలు ఉండవచ్చు లేకపోవచ్చు. వాడు నిర్గుణుడు అవ్వవచ్చు సగుణుడు అవ్వవచ్చు. వాడు నిరాకారుడు అనవచ్చు, సాకారుడు అనవచ్చు. కాని ఉండటం ఉన్నాడు. నువ్వు లేడు అనుకున్నంత మాత్రం చేత ఉన్నవాడు లేకుండా పోడు. దేవుడు లేడు అనుకొంటే అది నీ అజ్ఞానానికి గుర్తు. ఈశ్వరుడు ఉన్నాడు! వాడు కర్మఫలదాత, అడ్మినిస్ట్రేటరు. నువ్వు చేస్తున్న మంచి పనులకి చెడ్డ పనులకి ఎప్పుడు అనుసంధానం చెయ్యాలో చూస్తూ ఉంటాడు. వాడికి ఆకారం ఉందా లేదా, లేకపోతే వాడికి గుణాలు ఉన్నాయా లేవా, ఈ గొడవలు మీకు అనవసరం. వాడికి ఆకారం ఉంటే ఏముంది, లేకపోతే ఏముంది. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. వాడిని విశ్వసించండి. విశ్వసిస్తే సొమ్ము, లేకపోతే మిగిలేది దుమ్ము.

రామకృష్ణుడిది నరేంద్రుడిది జన్మాంతర అనుబంధం. నరేంద్రుడు రామకృష్ణుడిని మీరు దేవుడిని చూసారా అని అడిగితే, చూసాను, సందేహం లేదు అంటాడు. ఎలా చూసారు, అంటే, నిన్ను నేను ఎంత స్పష్టముగా చూస్తున్నానో, నువ్వు నన్ను ఎంత స్పష్టముగా చూస్తున్నావో, అలాగ నా హృదయములో ఉన్న వస్తువుని, నా హృదయములో ఉన్న దైవాన్ని అంత స్పష్టముగా దర్శించాను అంటాడు రామకృష్ణుడు. అయితే నువ్వు నన్ను ప్రశ్న అడిగావు, నేను సమాధానం చెప్పేసాను. అది వదిలేయి. నువ్వు నా నరేంద్రుడవు నేను నీ

రామకృష్ణుడిని అంటాడు. అది పూర్వ జన్మ అనుబంధం. సంకెళ్ళు గొడ్డలి పెట్టి నరకవచ్చు, అవి కళ్ళకి కనిపిస్తా ఉంటాయి. కాని జన్మాంతర అనుబంధం నరకలేము, అది మన కళ్ళకి కనపడదు. అంతటా వ్యాపించిన పరమేశ్వరుడిని చూడగలమా! భగవంతుడు సర్వత్రా వ్యాపించి ఉన్నాడు, పంచభూతాలకి ఆధారంగా ఉన్నాడు, దేవతలకి ఆధారంగా ఉన్నాడు. మనకీ ఆధారంగా ఉన్నాడు. అంతటా వ్యాపించి ఉన్న భగవంతుడిని ఈ నేత్రాలు చూడగలవా. మీ ఇంటిలో కిటికీలు ఉంటాయి. ఆ కిటికీ లోనుంచి వీధి అంతా చూస్తున్నావు నువ్వు. అలాగే, నరేన్, నా ద్వారా నువ్వు దేవుడిని చూడు. అంతటా వ్యాపించిన దేవుడిని నువ్వు చూడలేవు, నువ్వు డైరెక్టుగా చూడలేకపోతే, నీ ఇంటిలో ఉన్న కిటికీ లోనుంచి వీధిలోకి ఎలా చూస్తున్నావో, దేవుడిని నా ద్వారా దర్శించు. అంతటా ఉన్న వస్తువుని నీ కళ్ళతోటి చూడలేవు. నా ద్వారా నువ్వు చూడు అంటాడు రామకృష్ణుడు.

మీరు భౌతికంగా అనేక వస్తువులు సంపాదించుకొంటున్నారు. సమాజంలో గౌరవాలు, డబ్బు, అధికారం సంపాదించుకొంటున్నారు. శరీరం సుఖపడటానికి అనేక ప్రక్రియలు చేసుకొంటున్నారు. మంచిదే, శరీరం తాత్కాలికం అయినా, శరీరం చనిపోయేవరకూ అది ఉండాలి కాబట్టి దానికి కంఫర్ట్ గా ఉంచటానికి తగిన పనులు చేసుకొంటున్నారు. కాని నేను (శ్రీ నాన్నగారు) చెప్పేది ఒకే ఒక వాక్యం. మీరందరూ లోకంలో విషయాలు, వస్తువులు ఎలా సంపాదించుకొంటున్నారో, అలాగ ఈశ్వరుని ప్రేమని, ఈశ్వరుని దయని, ఈశ్వరుని అనుగ్రహాన్ని సంపాదించుకోండి. ఇంతకంటే చెప్పేది ఏమీ లేదు. పరమేశ్వరుడు ఒకడు ఉన్నాడు. ఆ పరమేశ్వరుడి యొక్క దయ ఉంటే మనకి అన్నీ ఉన్నట్టే, ఆ దయ లేకపోతే మనకి ఏమీ లేనట్టే. అందుచేత మనమందరం కష్టపడి, మాట ద్వారా కాని, చేత ద్వారా కాని, ఆలోచన ద్వారా కాని, నిరంతరముమీరు చేసే సాధనల పేరు మీద కాని, ఈశ్వరానుగ్రహం, ఈశ్వరుని యొక్క కరుణ, ఈశ్వరుని యొక్క ప్రేమ, ఆయన యొక్క ఆశీస్సులు సంపాదించు కోవటానికి ప్రయత్నించండి. అది తప్పించి ఇంకొక పని మనకి ఏమీ లేదు. అది ముఖ్యమైన పని.

# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**దుఃఖేష్వను ద్విగ్నమనాః సుఖేషు విగత స్పృహః ।**
**వీతరాగ భయక్రోధః స్థిత ధీర్మునిరుచ్యతే ॥2-56 ॥**

**తాత్పర్యము :** దుఃఖములకు కృంగిపోని వాడును, సుఖములకు పొంగిపోనివాడును, ఆసక్తిని, భయక్రోధములను వీడినవాడును ఐనట్టి మననశీలుడు (ముని) స్థితప్రజ్ఞుడు అనబడును.

దుఃఖేష్వను ద్విగ్నమనాః- నీకు దుఃఖం వస్తే క్షోభ చెందకు. ప్రకృతివల్ల, సంసారకష్టాల వల్ల ఎప్పుడైనా దుఃఖం రావచ్చు. సర్వసాధారణంగా నూటికి డబ్భై దుఃఖాలు పేదరికం వల్ల వస్తాయి. భగవంతుడు మాయని అంతా డబ్బులో పెట్టేశాడు అని వాల్మీకిమహర్షి రామాయణంలో చెబుతాడు. సంపాదన లేని వ్యక్తిని ఇంట్లో మనుషులు కూడా శవాన్ని చూసినట్టు చూస్తారు. దుఃఖం వచ్చినప్పుడు కూడా నీకు క్షోభ కలుగకూడదు. విచారము కలుగకూడదు. దుఃఖం లేనప్పుడు ఎలాగూ విచారం ఉండదు. నీకు దుఃఖ కారణం ఉన్నా కూడా, క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు కూడా, నీకు మనసులో విచారం కలుగకూడదు. ప్రశాంతంగా ఉండాలి.

సుఖేషు విగత స్పృహః- దేహ ప్రారబ్ధాన్ని బట్టి నీకు సుఖం వస్తుంది. వచ్చినప్పుడు కూడా దానిమీద నీకు ఆసక్తి ఉండకూడదు. అందరూ దుఃఖం వద్దు అనుకుంటారు, కాని అందరికి సుఖం కావాలి కదా. దుఃఖం వచ్చినప్పుడు అంటకుండా ఉండమన్నాడు భగవంతుడు. అంతవరకు బాగానే ఉంది. అది మన హేతువాదానికి అందుతుంది. సుఖం వచ్చినప్పుడు కూడా ఆసక్తి పెట్టుకోకు అంటున్నాడు. భగవాన్ అనేవారట, అప్పుడు కొండమీద రాళ్ళలో పడి అలా ఉండవలసి వచ్చింది. అప్పుడేమో అన్నం లేదు, ఆకలి బాధ. ఆశ్రమం పెరిగాక రోజూ క్షీరాన్నాలు, లడ్డూలతోటి భోజనాలు పెడుతుంటే, ఇప్పుడేమో అజీర్తి బాధ. ఆయన అప్పుడేమీ దుఃఖపడలేదు, ఇప్పుడు సంతోషపడటంలేదు.

మీ దేహప్రారబ్ధాన్ని బట్టి దుఃఖం రావచ్చు సుఖం రావచ్చు. కాని దుఃఖం వచ్చినప్పుడు క్షోభ చెందకు. సుఖం వచ్చినప్పుడు ఆసక్తి పెట్టుకోకు. ఎందుకంటే, దేహప్రారబ్ధాన్ని బట్టి మీకు ధనం రావచ్చు, ఐశ్వర్యం రావచ్చు, ఇంద్రియ భోగం రావచ్చు. సుఖం వచ్చినప్పుడు నువ్వు ఆసక్తి లేకుండా అనుభవించు. ఆసక్తి పెట్టుకుంటే నీ మనసు మోక్షం వైపుకి తిరగదు. మళ్ళీ సుఖం వైపే తిరుగుతుంది. ఆ సుఖానికి బంధింపబడిపోతావు, బానిసవి అయ్యిపోతావు. ఆ రకంగా ఈ ఇంద్రియాలకి లోలుడువి అయ్యిపోతున్నావు. మీరైనా, నేనైనా, ఏ మతస్థుడైనా అనుభవించేటప్పుడు ఆసక్తితోటి అనుభవిస్తే అది తప్పనిసరిగా వాసనగా పడుతుంది. అయ్యో ఆ పదవి పోయిందే, ఆ ఐశ్వర్యం పోయిందే అనుకుంటే

అది మీ దుఃఖానికి కారణం అవుతుందని వాసుదేవస్వామి చెబుతున్నాడు. లక్ష్యం తప్పిపోతావు, గురి తప్పిపోతావు అని చెప్పటం కోసం మనమీద ప్రేమతో, కరుణతో ఎంత దూరం తీసుకెళ్ళి చెబుతున్నాడో చూడండి భగవంతుడు.

రామకృష్ణ పరమహంస అనేవారు, అగ్గిపుల్ల నానిపోయిన తరువాత ఎన్ని సార్లు గీసినా అగ్గిపెట్టి పోతుంది కాని అది వెలగదు. అలాగే ప్రకృతి వాసనలతోటి నానిపోయిన మనిషికి ఎంత చెప్పినా తెలియదు. లోపల పక్వానికి వచ్చిన మనిషికి ఒక చిన్నమాట సరిపోతుంది. శంకరాచార్యుల వారు ఏమన్నారు అంటే ఎవడైతే తిరిగి జన్మించడో వాడు మరణించినట్టు. మనం తిరిగి వెంటనే జన్మిస్తాము కాబట్టి మనకి మరణం లేనట్టే! శరీరం ఉండగా మరణించిన వాడు జ్ఞాని అవుతాడు, ఇది రమణస్వామి చెప్పే సిద్ధాంతం. ఈ శరీరానికి చావు వచ్చే లోపు మనకి చావు వస్తే, ఆ రోజున వాడు జ్ఞాని అవుతాడు. అంటే జీవించి ఉండగానే మరణించి జన్మించాలి. రాగం విడిచిపెట్టు, భయం విడిచిపెట్టు, క్రోధం విడిచిపెట్టు అంటున్నాడు. మీరందరూ నాకు ఏదైనా ఉపకారం చేసారు అనుకోండి, బహుమానాలు ఇచ్చారనుకోండి, నాకు తెలియకుండా మీమీద రాగం పుడుతుంది. మీరు అందరూ కలిసి నాకు అపకారం చేశారు అనుకోండి, లేకపోతే అవమానించారు అనుకోండి, నాకు తెలియకుండా మీమీద నాకు ద్వేషం పుడుతుంది. ఇవి రెండు విడిచిపెట్టేయమంటున్నాడు భగవంతుడు.

వీత, రాగ, భయ, క్రోధ – రాగాన్ని విడిచిపెట్టు, భయాన్ని విడిచిపెట్టు, క్రోధాన్ని విడిచిపెట్టు. అచలన స్థితిని పొందు, అది అభయ స్థితి. వైరాగ్య స్థితి.

ఎవరైతే రాగరహితుడో, భయరహితుడో, ద్వేషరహితుడో, దోషరహితుడో, వాడు శరీరంలో ప్రాణం ఉండగానే, వాడి ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, వృత్తులు, అన్నీ ఆత్మలో లయం అయిపోతాయి. వాడే జ్ఞాని. వాడు నా స్వరూపాన్ని పొందుతాడు, అంటే అమృతస్థితిని పొందుతాడు అంటున్నాడు వాసుదేవస్వామి. రమణమహర్షి గారి బుద్ధి, ఇంద్రియాలు ఆత్మలో లయం అయ్యాయి. ఆయన మనస్సు ఆత్మలో లయం అయ్యింది. ఆయన ఈశ్వరస్వరూపం పొంది, జ్ఞాని అయ్యాడు.

భయరహితమైన స్థితి ఇప్పుడే వస్తే, మీ ఇంద్రియాలు, మనస్సు, అహంకారం, బుద్ధి, ఇవేవీ మిమ్మల్ని బాధ పెట్టవు. మీకున్న శక్తులు యుక్తులు అన్నీ కూడా ఆత్మలో లయమైపోతాయి. మీరు ఆత్మాకారం పొందుతారు. ఇంద్రియాలు ఉన్నప్పటికీ ఇంద్రియాలు లేని వాళ్ళు ఎలా ఉంటారో, మనస్సు ఉన్నప్పటికీ మనస్సు లేని వాళ్ళు ఎలా ఉంటారో, శరీరం ఉన్నప్పటికీ శరీరం లేని వారు ఎలా ఉంటారో, అలా అయిపోతారు. దేహం ఉండగానే దేహాతీతమైన స్థితిని పొందుతారు.

## జిన్నూరు శ్రీ రమణ క్షేత్రంలో జరుగు కార్యక్రమములు

| | | |
|---|---|---|
| ది॥ 15-02-2026 | ఆదివారం | మహాశివరాత్రి |
| ది॥ 13-03-2026 | శుక్రవారం | విగ్రహ ప్రతిష్ఠా వార్షికోత్సవము |

# శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు వారి ప్రచురణలు

- ☞ శ్రీ నాన్నగారి దివ్యజీవితం
- ☞ శ్రీ నాన్న ప్రవచనాలు
- ☞ జ్ఞాన రత్నాలు 1 & 2
- ☞ అమృత వాక్కులు
- ☞ గీతామృతం
- ☞ భోదామృతం
- ☞ ఉన్నది బ్రహ్మము ఒక్కటే
- ☞ హితోపదేశం
- ☞ భజ గోవిందం
- ☞ అక్షరమణమాల
- ☞ భగవద్గీతాసారం
- ☞ Words of Nector
- ☞ Brahmam alone Exists

ఈ ప్రచురణలు అన్నీ సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి స్వీకరించి ప్రచురించబడినవి. ఈ ప్రచురణల మీద సర్వహక్కులు మావే. మా అనుమతి లేకుండా ఈ పుస్తకములు ప్రచురించిన యెడల చట్టరీత్యా తగు చర్యలు తీసుకొనబడును అని తెలియజేయడమైనది.

ఇట్లు

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు**

# మహాశివరాత్రి

మాఘ మాసంలో బహుళ చతుర్దశినాడు జరుపుకునే మహాశివరాత్రి శివుని జన్మదినం, అదే లింగోద్భవం. అవ్యక్తమైన, నిరాకారమైన పరమాత్మ లింగరూపం ధరించిన రోజు. శివుని జన్మతిథిని జరుపుకునేదే మహాశివరాత్రి. శివుడు అంటే చిదంబర బ్రహ్మము, మంగళప్రదుడు, శుభాన్ని ఇచ్చేవాడు. శుభం అంటే మనస్సు శుభంగా ఉండడం. అనగా మనస్సులో దోషాలు లేకపోవడం. అందువల్లే మంచి మనస్సును ప్రసాదించమని, బుద్ధిని శుద్ధిచేయమని, శివుడిని ప్రార్థించాలి. సదాశివుడు స్వయంప్రకాశమాన మహాతత్వము, మహా ప్రకాశ స్వరూపము. కార్యము - కారణము రెండూ శివుడే! శివుడు కాలచక్రము, కర్మచక్రము, సంసారచక్రము మున్నగువాటికి అతీతుడు కాబట్టి; ఆయనను ఆశ్రయిస్తే మనలను వాటికి అతీతమైన స్వరూపంలోకి మేల్కొలిపి, అభయ స్థితిని ప్రసాదిస్తాడు. మనము శరణాగతి చెందినపుడే ఆయన అనుగ్రహము మనకు అనుభవైకవేద్యం అవుతుంది. శివానుగ్రహం కలిగిన వారికి శివుడు తన స్వరూపాన్ని ఇస్తాడు. జీవుడిని మరల మరల శరీరంలోకి తీసుకువడానికి "నాది" అన్న చిన్న తలంపు సరిపోతుంది. అహంకార, మమకార రూపంలో ఉన్న దేహాభిమానము నశించకుండా ఆత్మజ్ఞానం కలుగదు. స్వరూపంగా జీవుడు - శివుడు ఒక్కరే. అజ్ఞానము వలన నేను వేరు, శివుడు వేరు అన్న భావన కలుగుతోంది. జీవుని స్వభావము సత్యము - శివము - సుందరము. మన హృదయాలయంలో శివుడు పరిశుద్ధ జ్ఞానంగా ప్రకాశిస్తున్నాడు. జ్ఞాన నేత్రంతో ఆయనను తానుగా, నేనుగా తెలుసుకోవడమే జీవిత పరమార్థం. మనకు సకలమునూ ఇచ్చువాడు శివుడు, అట్టి శివుడు మన నుండి కోరుకునేది మన అహంకారాన్నే. మన అహంకారాన్ని ఆయన మ్రింగేస్తే ఇంక మిగిలేది శివుడే. చలించే మనస్సుకు, అచల స్వరూపుడైన శివుడే శరణ్యము. అనిత్యమైన వాటికి, నిత్య సత్య స్వరూపుడైన శివుడే శరణ్యము. దేశ-కాల-క్రియలకు లోబడిన వాటికి, దేశ-కాల-క్రియలకు అతీతుడైన శివుడే శరణ్యము. ప్రకృతి జ్ఞానము వలన మోక్షము కలుగదు, శివజ్ఞానము వలన మాత్రమే మోక్షము కలుగుతుంది. శివుడు, దైవము, గురువు, నిజమైన-నేను, ఇవన్నీ సమానార్థకములు. సమస్త జ్ఞానానికి మూలమైన వాడు శివుడు, ఆయనే దక్షిణామూర్తి. ప్రాకృతిక గుణాలను పారద్రోలి, పవిత్రగుణాలను అలవరచుకొనుటయే జన్మసార్థకత, అదియే శివరాత్రి సందేశము. మహాశివరాత్రి సందర్భముగా సద్గురు శ్రీనాన్నగారి సందేశాన్ని అనేకసార్లు శ్రవణము చేసిన మనము ధన్యులము.

**శివాయ గురవే నమః**

**(దిII 15-02-2026 మహాశివరాత్రి సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**